# ఏకాంత సేవ

"ఏడు కొండలవాడా గోవిందా! వడ్డికాసులవాడా గోవిందా!" అని వీథిలో అరుపు, ఇంకెవరు? అరచేతిలో పళ్లెం, పళ్లెంలో చెంబు, చెంబుకి నాల్గుప్రక్కలా పసుపుపూత, ముందుభాగాన మూడు నామాలు, చెంబుపైన పసుపుగుడ్డ, గుడ్డకి మధ్యన నాణెములు దూరినంతగా ఒక కన్నమూ కలిగి, స్వీయ ఫాలభాగాన మూడు దీర్ఘనామాలు కలిగిన వ్యక్తి అవుపించాడు.

"అమ్మా! అయ్యా! ఏడుకొండలవాడి దర్శనానికి వెళుతున్నాను. నా కుమారుడికి కాళ్ళూ చేతులు పడిపోతే, తిరుపతి వచ్చి పుట్టుజుత్తులు తీయిస్తానని మొక్కుకున్నాను. మీకు తోచిన సాయం చేయండి." అని అతను దీనంగా ప్రార్థించాడు.

వివాహోత్పూర్వం అంగవైకల్యం గల భిక్షువులను చూస్తే దయ, దాక్షిణ్యమూ అంటూ ఉండేవి నాకు. ఏదో యథాశక్తి సహాయం చేసేవాడిని. కాని దురదృష్టవశాత్తూ నా దేహానికి మరో అర్ధదేహం మిళితం కావడంతో నాకు గల ఈ సుగుణాలు అంతర్ధాన మయ్యాయి. కటిక కర్కోటకునిగా తయారయ్యాను.

"వెళ్లవోయబ్బీ! ఇప్పుడు వీలుకాదు" అని నా అలవాటు ప్రకారం నేననేశాను. ఈ అలవాటు నాకు జన్మతః వచ్చింది కాదుగా! అర్ధాంగి గారివల్ల నేర్చుకున్న క్రొత్త అలవాటు.

"ఉండవోయబ్బీ! ఆగు!" అని లోపల నుంచి కేక! గతుక్కుమన్నాను. మా ఆవిడే!

నాకు వెంటనే ఒకకథ జ్ఞాపకం వచ్చింది. వెనకటికో కోడలు ఇంటికొచ్చిన భిక్షుకుణ్ణి పొమ్మంటే, కొళాయినుండి నీళ్ళబిందె మోసుకొస్తున్న అత్తగారు కనబడి, భిక్షుకుణ్ణి ఇంటికి పిలుచుకు వెళ్ళి - "ఇప్పుడిహ దయచెయ్యి. ఈ ఇంటికి పెత్తనం మా కోడలిది కాదు. నాది! అదెవర్తె నిన్ను పొమ్మనడానికి?" అందిట. అలాగే మా యింటికి పెత్తనం 'ఇల్లాలిది' గనుక, ఆవిడే భిక్షుకుల్ని పొమ్మనాలి గాని, నే నెవణ్ణి భిక్షుకుని పొమ్మనడానికి? అని అంటుంది కాబోలు!

కాని నే ననుకున్నట్టు మా ఆవిడ, అతగాణ్ని పొమ్మనలేదు.

చీరచెంగు ముడివిప్పి ఒక పావలాకాసు తీసి, అతని డబ్బీలో పడవేసి, ఆ డబ్బీకి రెండుచేతులూ ఎత్తి నమస్కారం చేసింది.

భిక్షుకుడు వెళ్ళిపోయాడు.

ఇంతటితో కథ ఆగిపోయిందా ఏమిటి? ఇహ నన్ను సాధించడం మొదలుపెట్టింది.

"మీ కామాత్రం బుద్ధుండక్కర్లా? దేవుణ్ని పొమ్మంటారు?" అంది.

నిజంగా నేను చచ్చాను. అతడు దేవుడని నాకేం తెలుసు?

"మరి నువ్వు చెప్పిన విద్యేనా ఇదీ? నీరజాక్షీ! ఇతనికంటే ముందు కుంటివాడొకడు గుడ్డివాడొకడూ వస్తే నువ్వే ఆ వ్యక్తులకు తృణమో పణమో ఇద్దామనుకున్న నన్నుకూడా ఆపేశావ్" అన్నాను. నిజమే మరి! అరగంట క్రితం వెళ్ళిన ఇద్దరు ముగ్గురు భిక్షువులకు ఏదో సహాయం చేద్దామనుకుంటే "మీరలా ఆగండి. తొందరపడి ఎవరికీ ఏమీ ఇవ్వబోకండి! ఎవరి కివ్వాలో, ఎవరి కివ్వకూడదో నాకు తెలుసును!" అని ఆపింది నన్ను.

"వాళ్ళకీ ఇతనికీ తేడాలేదుటండీ! వీళ్లెప్పుడూ ఇక్కడున్నవాళ్లే! అతగాడైతే తిరుపతి వెళ్లనున్నాడాయె! కొడుక్కి పుట్టుజుత్తులు తీయించాలా మరి? వేంకటేశ్వర స్వామి దర్శనం చేస్తాడంటారా?" అంది ఆవిడగారు.

"మరి అతనే దేవుడన్నావు! తనను తాను చూసుకుందికి తిరపతి వెళతాడా?" అన్నాను నేను. మీరు నాతో మొండివాదన చేయకండి! నాకుచికాకు!" అని రివ్వున వెళ్ళి పాకకర్మలో నిమగ్నురాలైంది.

• • •

వారం రోజులు పోయేక ఒక ఉదయాన అదే భిక్షుకుడు యథాప్రకారం

"ఏడు కొండలవాడా! గోవిందా!" అంటూ తన పాతపాటనే వల్లెవేస్తూ హాజరయ్యాడు

నేను మరి వినీ విననట్టు ఊరుకున్నాను.

వీధిలో ఆడుకుంటున్న మా నాలుగేళ్ళ అబ్బాయి "పో పో!" అంటూ బండి చక్రం దొర్లించుకునే కర్ర ఎత్తాడు అతని మీదికి!

"వెధవా! తప్పు! కళ్లుపోతాయ్!" అంటూ వీపుమీద ఒకొబ్బట్టు వేసింది వాళ్లమ్మ.

భిక్షుకునికి మరచాను, వేంకటేశ్వర స్వామికి ఏదోఇచ్చి పంపించింది.

కుర్రవెధవ ఏడుపు!

"ఊరుకో బాబూ! అమ్మకొట్టిందా? అమ్మను కొట్టేస్తానులే!" అని ఓదార్చాను వాణ్ని.

"మధ్యను వాణ్నెందుకే కొడతావు? వచ్చిన ముష్టివాళ్ళని గెంటెయ్యమని నువ్వే కాపలాపెట్టావు వాణ్ని. చిన్నప్పటినుంచి దయాదాక్షిణ్యాలూ, ధర్మకర్తృత్వమూ వాడి కెక్కడ అబ్బేస్తాయో అని భయం నీకు! పిల్లలకి దుర్లక్షణాలు అబ్బడానికి కారణం తల్లిదండ్రులే అవుతారు. కాని, ఈ సందర్భంలో నువ్వే అయినా నన్ను కూడా అంటారు. ఇది సహజం" అన్నాను.

"ఏడిసినట్టుంది మీ సొద! భిక్షుకుల్ని తరిమెయ్యడానికి పెట్టానూ అంటే మామూలు ముష్టివాళ్ళని పొమ్మనమనిగాని, తిరపతి కొండకి వెళతా నన్నవాళ్ళని కాదు." అంది మా ఆవిడ.

"నీ తాత్పర్యం ఆ కుర్రకుంకకేం తెలుస్తుంది. నువ్వెలా చేస్తే అలాగే చేస్తారు వాళ్ళు. కాగా, తిరుపతి కొండకి వెళతానని వేషం వేసుకొచ్చినవాడే నీ దృష్టిలో మంచివాడు కాని, వికలాంగులైనవారు కారన్నమాట!" అన్నాను.

ఒక భిక్షుకుని యెడల గౌరవభావం, వేరొక భిక్షుకునిపట్ల అగౌరవభావం పోగొట్టి, ఇరువురి పట్ల సమదృష్టి కలిగించాలనే ప్రయత్నం నాది.

"అయితే అతడు వేషగాడంటారా?" ఆమె ప్రశ్న.

"కాక మరేమిటి? ఏదో బ్రతుకు తెరువుకి వేసిన ఎత్తుగడ అది!"

"అని మీరెట్లా రూఢిపరచగలరు?" ఎదురుప్రశ్న.

"అతడు మళ్లీ భిక్షకి బయలుదేరడమే నిదర్శనం. అతడు మనింటికి

రావడం కొత్తేఅయినా, ఈ ఊళ్లో చాలాకాలంనుంచి ఉంటున్నాడు. వారానికో వీధి చొప్పున తిరుగుతున్నాడు." అన్నాను.

"నాకు నమ్మకం లేదు. వారానికో వీధి చొప్పున తిరుగుతున్నంత మాత్రాన అతడు వేషగాడంటే ఒప్పుకోను. స్వామి దర్శనం చేసుకుందికి భార్యాపుత్ర సమేతంగా వెళ్లాలిగదా? ఈ ముగ్గురికీ కావలసిన రైలుఖర్చు కలిసిరావాలంటారా? మాటలా ఏమిటి?" అన్నదామె.

అంతేకాని ససేమిరా నా మాట నమ్మలేదు. నే నంతకన్నా ఆమెను నమ్మించడానికి ప్రయత్నమూ చేయలేదు.

"ఏమండోయ్! మిమ్మల్నే! త్వరగా లేవండి! ఇవాళ శనివారం. మరిచిపోయారా ఏమిటి? వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాలి. ఇవాళ ఆదివారం కాదు ముసుగుతన్ని పడుక్కోందుకి! లేచి స్నానంచేసి పట్టుబట్టలు కట్టుకోండి" అని లేపింది మా ఆవిడ.

ఔనన్నట్టు! ఇవాళ శనివారం. వేంకటేశ్వర స్వామి వారి గుడికి వెళ్ళాలి. కళత్ర పుత్రసహితంగా ఆలయం చేరాను.

ఎవరో భక్తుడు స్వామివారికి "ఏకాంత సేవ"చేస్తున్నాడు.

"స్వామీ! వేంకటేశ్వరా! దీనదయాళూ! ఈ కలియుగ మానవులు మర్యాదగా, నయాన ఎప్పుడూ భిక్షవేయరు. అంచేత భయాన వేయిస్తున్నా. "కలౌ వేంకట నాయకః" అని పెద్దలు నుడివినట్టు, ఈ కలియుగంలో నీ పేరు చెబితేనే ఎవరికైనా భయం! ఆ భయంవల్లనే వారికి ఎక్కడలేని దాతృత్వగుణాలూ పుట్టుకొస్తున్నాయ్. కారణమేమంటే, కుంటివానిగానూ, గుడ్డివానిగానూ వున్నప్పుడు ఎవ్వరూ నాకు భిక్షవేయలేదు. దుక్కనక్కలా వుండి, పళ్ళెమూ చెంబూ నామాలూ పెట్టుకునేసరికి ప్రతివారూ హడలెత్తిపోయి భిక్షవేస్తున్నారు. నీ కొండకి వెళ్తానని అబద్ధమాడి, సంపాదిస్తున్న ఆదాయం ఏ రోజే నిజదార-సుతోదర పోషణార్థం ఖర్చయిపోతున్నది. నీ కొండకి ఎలాగూ రాలేను గనుక, రోజూ నాకు వచ్చే ఆదాయంలో నాలుగోవంతు స్వీకరించి నన్ను క్షమించు ప్రభూ!"

• ఆంధ్రజ్యోతి దినపత్రిక •
*20.10.1960*